క్లుప్తంగా

దెబ్బతిన్న పంటల పరిశీలన



బావికాడపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పుల్లంపేట : మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ఉద్యానశాఖ అధికారి సురేష్‌బాబు రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో కలిసి బావికాడపల్లి, వత్తలూరు, అనంత సముద్రం గ్రామాలలో పర్యటించి మండలంలో 223 ఎకరాలు అరటి, 40 ఎకరాలలో బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు. నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ భాను, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నరసింహ

రాయచోటి అర్బన్ : ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్, నీట్‌లను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సర్వేపల్లె నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష రాయదలచుకున్న విద్యార్థులు రూ.100లు పరీక్ష రుసుం చెల్లించి తమపేర్లు నమోదు చేసుకోవాలంటూ కోరారు. మరింత సమాచారం కోసం రాయచోటి 9010627332, 9505608509, మదనపల్లె 6281362955, 9104709993, కోడూరు 9505582859 నంబర్లకు సంప్రదించాలంటూ కోరారు.

ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పించండి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా 5, 9, 10 వార్డులకు చెందిన వాహనం ప్రమాదానికి గురి కావడంతో ఈ వార్డులలో బియ్యం ఇంటి వద్దకే సరఫరా చేయడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వార్డులకు రేషన్ ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ వాహనాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమలో 9వ వార్డు కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, బి.మహమ్మద్‌ఖాన్, 1వ వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మైనార్టీ జనరల్ సెక్రటరీ అన్నా సలీం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని 20వ వార్డులోని రూ. 5లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం 20వ వార్డులోని డిష్ రెడ్డెన్న వీధి, టెంకాయ చెట్టు వీధులలో ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే 15 ఫైనాన్స్ సంవత్సరం కింద మరో రూ.10 లక్షల నిధులు విడుదల కాగానే డ్రైనేజీ, వీధి లైట్లు వంటి మౌలిక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, రఘునాథయ్య, యోగాంజరెడ్డి, రాజేంద్ర, ఆది, నాగేశ్వర, రామ్మోహన్, రెడ్డెయ్య అమరనాథ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివాహాలు, వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో కడప డివిజన్‌లో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి వరప్రసాద్ తెలిపారు. కడప నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలోని తమ షోరూంలోని క్లియరెన్స్ సేల్స్ కౌంటర్‌లో ఈనెల 20 నుంచి ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. అలాగే 1+1, 1+2 విక్రయాల కూడా జరుగుతున్నాయని వివరించారు. మాధవరం, రాజమండ్రి, బందరు, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ చీరలు, పాందూర్ షర్టింగ్, పట్టు, కాటన్ దోవతులు, టవళ్లు కొనుగోలు చేసి చేనేతలను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ క్యాంపు ప్రారంభమైంది. ఈ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఒక చక్కటి మార్గమన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ క్యాంపులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల నాగరాజు మాట్లాడారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి గడపకు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ప్రజల గుండెల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాశెంగడ్డ, పాపన్నగారిపల్లె, శ్రీ హరికాలని, అడవికమ్మపల్లెలలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతోపాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వంతో అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు. ఏకిల కులస్తులను బీసీలలో చేర్చిన ఘనత వైఎస్‌ఆర్‌దే నన్నారు. అర్హతే ఆధారంగా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన రారాజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు.

జగనన్న పాలనలో పాడి రైతులకు సిరులు

జగనన్న పాలనలో పాడిరైతులకు పాలధరలు బాగా పెరిగి అదనపు ఆదాయం కలుగుతోందని పాలెంగడ్డపాపన్నగారిపల్లెకు చెందిన పాడిరైతులు ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతులతో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పాలకు ఉన్న రేట్లు, ప్రస్తుతం రేట్లు ఎలా ఉన్నాయని రైతులతో ఆరాతీయగా గతంలో 1 లీటరు రూ.25, ప్రస్తుతం 1 లీటరు రూ.37 లేదా రూ.40 ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కవిత, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు, మండల స్థాయి అధికారులు తదితరలు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని లోకసభ ప్యానెల్ స్పీకర్, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, నవాజ్ బాషాలు పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గం పరిశీలకుడు హబీబుల్లాఖాన్ ఇంటిలో ఏర్పాటు చేసిన రంజాన్ విందులో వారు పాల్గొన్నారు. నియోజకవర్గ సమస్యలపై వారు చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ముస్లింల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి

లక్కిరెడ్డిపల్లె : ముస్లింల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. లక్కిరెడ్డిపల్లెలో రూ.15 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ ప్రహరీగోడ నిర్మాణ పనులకు జరిగిన భూమిపూజలో ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం రూ. 5 లక్షల నిధులతో పూర్తయిన శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు - నేడు పనులు పరిశీలించిన డీఈఓ

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేస్తున్న నాడు - నేడు పనులను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను వేగవంతంగా చేయాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పనులు నాణ్యతగా త్వరితగతిన చేపట్టాలని సూచించారు. పీఆర్టీయూ చైర్మన్ శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, జయచంద్రలు, జేఈ జిలానీబాషా పాల్గొన్నారు.

నేడు ఆది శంకరాచార్యుల జయంతి

కడప కల్చరల్ : జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల బిర్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షుడు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద నుంచి ఉదయం 5.30 గంటలకు పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పథకాల తీరుపై సామాజిక తనిఖీ



శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్టేట్ రీసోర్స్ పర్సన్ డాక్టర్ రవికిరణ్

సిద్దవటం : ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల తీరుపై ఉపాధ్యాయులు సామాజిక తనిఖీ ద్వారా నిర్దేశిత యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు సామాజిక తనిఖీ శిక్షణా కార్యక్రమాన్ని స్టేట్ రీసోర్స్ పర్సన్ డాక్టర్ రవికిరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యా విషయక అంశాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల అవగాహన భాగస్వామ్యాన్ని సంబంధించిన సామాజిక తనిఖీలో మొత్తం 6 ప్రధానాంశాలు, 42 ఉప అంశాలు, 107 ప్రశ్నలు యాప్‌లో ఎలా పూర్తి చేయాలో పీ.పీ.టీ ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయా అంశాలకు సంబంధించి పాఠశాలల స్థాయిలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రశ్నావళిని పూరించాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర పథకాలను సక్రమంగా అమలు పరచి వాటి ఫలితాలను విద్యార్థులకు అందేలా చూడడంలో ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ మహేశ్వరరావు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్‌పై సోమవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ అహ్మద్ బాషా మాట్లాడుతూ పాఠశాల కమిటీ సభ్యులు సహకారంతో సోషల్ యాప్‌లో ఇచ్చినటువంటి 6 అంశాలు, 42 ఉప అంశాల మీద సోషల్ యాప్‌లో ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలని, అలాగే ఈ కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన అందరి బాధ్యత



కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

రాయచోటి అర్బన్ : మలేరియా నిర్మూలనను అందరూ బాధ్యతగా భావించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. సోమవారం రాత్రి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుగా ఉండేలా, డ్రైనేజీ నీరు నిలువ ఉండేలా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి మలేరియా వ్యాధి నివారణ చర్యలు మొదలు కావాలంటూ కోరారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి బి.వేణుపాల్, వైద్యసిబ్బందిలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వేల్పు ఉత్సవం



వేల్పు ఉత్సవంలో నిర్వహిస్తున్న ప్రధానం ఘట్టం

సంబేపల్లె : దొడ్డివారి వేల్పు ఉత్సవం సోమవారం ముగిసింది. ఈ ఆవుల వేల్పు ఎనిమిది సంవత్సరాలు తర్వాత నిర్వహించడంతో వైభవోపేతంగా జరిపారు. సోమవారం స్నానం ఆచరించి 40 మంది నైవేద్యాలతో వేల్పు ప్రాంతంలో వరుసగా కూర్చున్నారు. వీరిలో దేవరెద్దు ఎవరి దగ్గరకు వెళ్లి వారి నైవేద్యాన్ని తీసుకుంటుందో వారు పూజారిగా ఉంటారని పూర్వం నుంచి వస్తున్న ఆచారం ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి దేవరెద్దులు వేల్పులో కూర్చున్న వారిలో ఒకరి దగ్గరకు వెళ్లి నైవేద్యాన్ని స్వీకరిస్తాయి.

29న బహిరంగ సభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 29న నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకట శివ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ప్రచార భేరి, ప్రదర్శన, సభకు సంబంధించిన కరపత్రాలను వామపక్ష నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఓబులేసు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉమా మహేశ్వరరావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. వామపక్ష నాయకులు దస్తగిరి రెడ్డి, ఫరూక్ హుస్సేన్, చంద్రా రెడ్డి, కెసీ బాదుల్లా పాల్గొన్నారు.

అద్దంలో చూసుకో..



వై.జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కాన్వెక్స్ మిర్రర్

రాజంపేట : క్రాస్ రోడ్డులో కనిపిస్తున్న పెద్ద అద్దం .. మీ అందాలను చూసుకునేందుకు.. కురులు సరి చేసుకునేందుకు కాదు.. సుమా..సైడ్ రోడ్ లో నుంచి వచ్చే వాహనాలు స్పష్టంగా తెలుసుకునేందుకే జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా అప్పటి ఎస్పీ హర్షవర్దన్‌రాజు రోడ్ సేఫ్టీలో భాగంగా కాన్వెక్స్ మిర్రర్‌ను ఏర్పాటు చేయించారు. వై జంక్షన్, టీ జంక్షన్‌తోపాటు నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేశారు. వీటి ఫలితంగా రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా, అవగాహనతో కాన్వెక్స్ మిర్రర్ ద్వారా వాహనాల రాకపోకలను గమినించే అవకాశం ఉంటుంది. కాన్వెక్స్ మిర్రర్ ఏర్పాటు నిర్ణయంపై వాహనదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా జాన్‌బాబు

రాయచోటి : వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మదనపల్లె నియోజకవర్గానికి చెందిన బోనాసి జాన్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. జాన్‌బాబు నియామకంపై పలువురు నాయకులు ఆయన్ను అభినందించారు. పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తానని జాన్‌బాబు తెలిపారు.

పెరటి తోటల పెంపుతో ఆరోగ్యం



రాయచోటి టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీసోర్స్ సభ్యులు



చిన్నమండెం: ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ నజీర్‌బాషా

రాయచోటి టౌన్ : పెరటి తోటలు పెంచండి వాటిలో పండే ఆకుకూరలు, కారగాయలు తిని ఆరోగ్యాలను కాపాడుకోవాలని మండల ప్రకృతి వ్యవసాయ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ (ఎంసీఆర్‌పీ) బి.నాగరాజు రైతులకు సూచించారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం, గొర్లముదివీడు గ్రామాలలోని రైతులతో కలసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంతో రైతులు సాగు చేసి ఏ స్థాయిలో ఫలితం సాధించారనే విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గత ఏడాది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎన్ని ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు. సాధారణ పద్ధతిలో సాగు చేయడం (పురుగులు మందుల వాడకం ద్వారా సాగు చేయడం)వలన కలిగే నష్టం ఏంటి? ప్రకృతి వ్యవసాయం పద్ధతి ద్వారా లాభం ఏంటి? అనేవి తెలియజేశారు. మంచి ఫలితాలు సాధించిన రైతులు మిగిలిన వారికి కూడా వివరించి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు వెంకటరమణమ్మ, అంజనమ్మ, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానాలను అమలు చేసేందుకు ప్రకృతి వార్షిక కార్యాచరణ ప్రణాళిక(ఖరీఫ్ యాక్షన్ ప్లాన్) తయారుచేయాలని ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ వెంకటరమణనాయక్ రైతులతో, ఏపీసీఎన్‌ఎఫ్ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ఏ విధంగా తయారు చేయాలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేయడం వల్ల ఉపయోగాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలిపారు. 2023 - 24 వార్షిక సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయ రైతుల సంఖ్య విస్తీర్ణం పెంచడం కోసం, కొత్త రైతులు ప్రకృతి వ్యవసాయంలో అడుగిడి ప్రకృతి వ్యవసాయాన్ని అభ్యసించాల్సిన అవసరతపై దృష్టి సారించడం కూడా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో చిన్నమండెం గ్రామ సర్పంచ్ నజీర్ బాషా, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో చిరుధాన్యాలు సాగు చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా రైతులు, అధికారులు

ఓబులవారిపల్లె : 2023 - 24 ఖరీఫ్ సీజన్‌లో రైతులు చిరుధాన్యాలు సాగు చేయాలని ఏపీఎం ఆర్ముగం పేర్కొన్నారు. సోమవారం ఖరీఫ్ సాగుపై మహిళా రైతులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ముగం మాట్లాడుతూ మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుచేయడం అలవరుచుకోవాలని, చిరుధాన్యాల సాగుతో లాభాలు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ పుల్లయ్య మాట్లాడుతూ 2023 - 24 ఖరీఫ్ ప్రణాళికల గురించి రైతులకు వివరించారు. మండలంలో 1050 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు సాగు చేస్తున్నారని, అధిక స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సాగుచేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు.

సుస్థిర పాలనే గ్రామ పంచాయతీల లక్ష్యం

- గ్రామాల అభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం
- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

లక్కిరెడ్డిపల్లె : పేదరికం లేని సుస్థిర పాలన అందించడమే గ్రామ పంచాయతీల లక్ష్యమని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో శానిటేషన్, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెల్తీ పంచాయతీగా తీర్చిదిద్దడంతోపాటు బాల్య వివాహాల నిర్మూలన వంటి కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులతో కలిసి నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి కేక్ కట్ చేసి పంచాయతీరాజ్ ఉద్యోగులకు తినిపించారు. ఈవోపీఆర్డీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సంబరాలలో పంచాయతీరాజ్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌తో గ్రామాభివృద్ధి జరుగుతోందన్నారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీస్ వారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. మండల కో - ఆప్షన్ సభ్యుడు కలీం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గుట్టపల్లె సర్పంచ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

సంబేపల్లెలో..

సంబేపల్లె : గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలన్న జాతిపిత మాటలను నిజం చేస్తూ మన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చిదంబరంరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిదంబరంరెడ్డిని కలెక్టర్ ఉత్తమ సర్పంచ్‌గా సన్మానించారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : పుల్లంపేట సచివాలయం నందు సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధికి అధికారులందరూ సహకరించాలని వారు కోరారు. అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న గుండ్లచెరువు సర్పంచ్ ఉమ

ఉత్తమ పంచాయతీలుగా గుండ్లచెరువు, ప్యారంపల్లె, గోరాన్‌చెరువు

గాలివీడు : ఉత్తమ పంచాయతీలుగా మండలంలోనే గుండ్లచెరువు, ప్యారంపల్లె, గోరాన్ చెరువు గ్రామాలను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ శేఖర్ నాయక్ తెలిపారు. గ్రామాలలో మౌలిక వసతులు, పంచాయతీ పరిపాలనపై కేంద్ర బృందం ఆ గ్రామాలలో పర్యటించి ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసిందని తెలిపారు. జాతీయ గ్రామ పంచాయతీ దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గిరీషా పీఎస్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, పంచాయతీ అధికారి చేతులు మీదుగా అవార్డులను గుండ్లచెరువు సర్పంచ్ ఉమామహేశ్వరి, ప్యారంపల్లె సర్పంచ్ హరీష్‌కుమార్‌రెడ్డి, గోరాన్‌చెరువు సర్పంచ్ దీప్తి వెంకటాద్రిలతోపాటు గ్రామ కార్యదర్శులను దుశ్శాలువాతో సన్మానించి అవార్డులను ప్రధానం చేశారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ విజయారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈఓపీఆర్డీ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట: ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ

గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా..

ఒంటిమిట్ట : గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల ప్రజాపరిషత్ అధికారి రెడ్డయ్య ఆదేశించారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల మండల అధికారులతో ఎంపీడీఓ రెడ్డయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని పోలీసు, రెవెన్యూ శాఖ మినహా అన్ని శాఖలు స్థానిక సంస్థల ఆదీనంలోనే పనిచేస్తున్నాయని, మండలంలో పేదరిక నిర్మూలన, వైద్య ఆరోగ్య సేవల అభివృద్ధి, విద్యార్థులకు కావాల్సిన పాఠశాలల్లో ఉన్నత సదుపాయాలు, అంగన్వాడీ కేంద్రాలలో పసి పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం వంటి అన్ని రకాల సదుపాయాలపై, అభివృద్ధిపై దృష్టి సారించి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : గ్రామ పంచాయతీల ప్రతినిధులు, అధికారులు గ్రామంలోని పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి పేదరికాన్ని నిర్మూలించాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ అవరణలో సోమవారం 73వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందార్భంగా ఎంపీటీసీలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించాలంటే మానవ వనరుల అభివృద్ధి కీలకమైనదన్నారు. మానవ వనరుల అభివృద్ధిలో పరిశుభ్రత, ఆరోగ్యం, జీవనోపాధులు ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో మండల కో - ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నమండెం

చిన్నమండెం : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రహీమ్, తహసీల్దార్ శ్రీరాములునాయక్‌లు మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ చట్టం అమలుకు వారు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీలు, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్‌ఆలీఖాన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మునల్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచులు నజీర్ అహమ్మద్, లక్ష్మిరెడ్డి, లోకేశ్వర రెడ్డి, అఫ్రోజ్, ఎంపీటీసీలు శ్యామ్‌చంద్ర, వెంకటప్ప నాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.